క్లుప్తంగా

ఇద్దరు ఉపాధ్యాయినులకు అవార్డులు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో పాటిబండ్ల విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియన్ ఐకానిక్ టీచర్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయినులు పురస్కారాల్ని అందుకున్నట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఉపాధ్యాయినులు ధనాల శ్రీలక్ష్మి, కోటగిరి విజయ శిరీష ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడం పాఠశాల ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలగలిపి బోధించడం ద్వారానే ఉపాధ్యాయులు ఉన్నతస్థాయికి చేరుకుంటారని ఆయన తెలిపారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయిలను పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల కమిటీ సభ్యులు గుంజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ అభినందించారు.

సామాజిక న్యాయం ముద్దు.. సనాతన ధర్మం వద్దు



లాడ్జి సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు ఉదయ్‌నిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని, అప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందంటూ చేసిన వ్యాఖ్యల్ని దళిత ప్రజా సంఘాల నాయకులు సమర్థించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సామాజిక న్యాయం ముద్దు.. సనాతన ధర్మం వద్దు అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా భారతదేశంలో సనాతన ధర్మం అనే ముసుగులో మనువాదాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రెండు, మూడు వర్గాల వారిని పైస్థాయిలో నిలిపేందుకే ఇది ఉపయోగపడుతోందని విమర్శించారు. 85 శాతంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను అనేక రూపాల్లో వేధింపులకు గురిచేసిన మను వాదాన్ని బలపరుస్తున్న సనాతన ధర్మాన్ని శాశ్వతంగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, డాక్టర్ మద్దు అంకయ్య, నల్లపు నీలాంబరం, సుజాతరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణ

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో కల్యాణ మండపంలో బిక్షమయ్య గురూజీ పర్యవేక్షణలో ఈ నెల 12,13 తేదీలలో ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 12వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, 13వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మహిళా వ్యక్తిత్వ వికాస యోగ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సంపత్ గురూజీ 8919625862, ఎం.వి.రాఘవయ్య 9949844969, ఎం.వి.లక్ష్మి 7989757853లో సంప్రదించాలని కోరారు.

చిన్నారులకు చెస్ పోటీలు



తెనాలి: సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చిన్నారులకు చెస్ పోటీలు నిర్వహించారు. నాగసాయిదివ్య, కొత్త లక్ష్మి, హర్షిత్, అందె తన్మయ, సాదిక, దీపిక, దినేష్‌రెడ్డి సూర్యనారాయణ, శశాంక్, మౌళి, ప్రభంజన్‌లు విజేతలుగా నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్ మోచర్ల నిరంజన్ పర్యవేక్షించారు.

పేదలకు బియ్యం, నిత్యావసర కిట్ల పంపిణీ

నగరంపాలెం: పేదలకు సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేట జానీ కాంప్లెక్స్ ఆవరణలోని సమితి కార్యాలయంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం యాభై మందికి బియ్యం, నిత్యావసర సరకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమితి తరఫున దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి మాదాల ప్రకాష్, ఎస్.వి.రమణ, పలకలూరి శివరావు, పల్లంపాటి రజనీశ్వరరావు, మామిడి ప్రతిక, శ్రావణి, మురళీసాయి పాల్గొన్నారు.

ఈ-పంటతో సురక్షితం

- పొన్నూరు మండలంలో జోరుగా పంటల వివరాలు నమోదు
- రైతులకు బహుళ ప్రయోజనాలు
- పంట నమోదుతోనే కొనుగోలుకు అవకాశం
- బీమా అందాలంటే పంట నమోదు తప్పనిసరి
- మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలు, అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా నమోదు ప్రక్రియ



మండలంలోని మామిళ్లపల్లిలో ఈ-పంట నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

పొన్నూరు: ఖరీఫ్ సాగు చేసే ప్రతి రైతు ఈ-పంట(క్రాప్) నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం నుంచి పలు ప్రయోజనాలు అందుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పండించిన పంటలను దళారుల నుంచి కాపాడుకుని, ప్రభుత్వ కనీస మద్దతు ధర పొందాలంటే పంట నమోదు కీలకం. రైతు పొలాల వద్దకే వచ్చే వ్యవసాయాధికారుల వద్ద ఈ-క్రాప్ నమోదు సులభతరం. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఈ-క్రాప్ బుకింగ్ నమోదును రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-మండల పరిధిలో పంట పొలాలు మొత్తం 30 వేల ఎకరాలు ఉండగా, ఇప్పటివరకు 14,500 వేల ఎకరాలు పంట నమోదు చేసుకున్నారు. మొత్తం 15,575 రైతులు గాను, ఇప్పటివరకు 6 వేల మంది రైతులు పంట నమోదు చేసుకున్నారు. మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలు, అగ్రికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా పంట నమోదు జోరుగా సాగుతుంది.

■ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు ఈక్రాప్ నమోదు చేసుకోవడంపై శ్రద్ధ వహించడం శుభపరిణామం. పొన్నూరు మండల పరిధిలో వరి ప్రధాన పంట. వీటితో పాటు కూరగాయలు, తమలపాకులు తదితర పంటలు సాగవుతున్నాయి. క్షేత్రస్థాయికి తరలివస్తున్న అగ్రికల్చర్, హార్టికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా రైతులు పంట నమోదు పూర్తి చేసుకుంటున్నారు. ఏ సర్వే నంబర్లో ఏ రైతు, ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారన్న విషయాలను నమోదు చేస్తున్నారు. పంట సాగు చేసిన రైతును పొలం వద్దే ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తారు. ఇలా పూర్తి వివరాలతో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే రైతు భరోసా, పంట బీమా, మద్దతు ధర వంటి దెబ్బతింటే తక్షణం పరిహారం అందిస్తున్న ప్రయోజనాలు అందుతాయి. ఎన్నో ప్రయోజనాలకు మూలమైన ఈ-క్రాప్ నమోదును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

పలు ప్రయోజనాలు..



ఈ-క్రాప్‌లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా అన్నదాతలు ఎన్నో ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ఖరీఫ్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులకు ఈ-క్రాప్ తప్పనిసరి. దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే పంట నమోదు అయి ఉండాలి. అలాగే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే ప్రభుత్వం తక్షణం పరిహారం అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– దేగల వెంకట్రామయ్య, వ్యవసాయ అధికారి, పొన్నూరు

వీవీఐటీలో ఫస్టియర్ తరగతులు ప్రారంభం



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో కలసి పూజల్లో పాల్గొన్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: విద్య, ఉపాధి, నైపుణ్యాలతో పాటు విద్యార్థులకు మంచి అనుభూతులను, జ్ఞాపకాలను వీవీఐటీ కళాశాల అందజేస్తుందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన 2023–24 విద్యాసంవత్సరం మొదటి ఏడాది విద్యార్థుల తరగతులు ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ కళాశాలలోని మౌలిక వసతులు, సీమన్స్ ఎక్సలెన్స్, ఏపీఎస్ఎస్‌డీసీ నోడల్ కేంద్రం, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం వలన విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ పద్ధతులు అవలంభించేందుకు వారిలోని విలువలను పెంపొందించేందుకు వీవీఐటీ దోహదపడుతుందన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ మాట్లాడుతూ మెరుగైన భవిషత్తుకు విద్యార్థుల కృషి కీలకమని వారి కృషికి సరిపడా అన్ని వసతులను వీవీఐటీ కళాశాల అందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని వారి ఉపాధి ఉన్నత విద్య కోసం ఉపాధికల్పన శిక్షణ విభాగం పనిచేస్తుందని తెలిపారు. మెరుగైన విద్యను నైపుణ్యంగా మార్చి విలువల కోసం పని చేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. విద్యతో పాటు అన్ని రంగాలలో ప్రావీణ్యం పొందేందుకు వీవీఐటీ చక్కటి అవకాశమని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, డీన్ డాక్టర్ కె.గిరిబాబు, సెక్రటరీ సూర్యదేవర బదరిప్రసాద్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి చంద్రబాబు పాపం పండింది

- వచ్చే ఎన్నికల్లో సానుభూతి కోసం టీడీపీ డ్రామాలు
- బాబు 14 ఏళ్ల పాలనకు 14 రోజుల జైలు
- ప్రతి స్కీంలో స్కాం చేసిన ఘనత బాబుదే..
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



పొన్నూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాపం పండిందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే రోశయ్య విలేకరులతో మాట్లాడారు. ఆయన 14 ఏళ్ల పాలనకు 14 రోజుల రిమాండ్ పడటం సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబు అవినీతి పాలనకే శ్రీకారం చుట్టారని విమర్శించారు. ప్రతి స్కీంను స్కాం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. 2014లో అధికారం చేపట్టిన రెండు నెలలకే స్కిల్ స్కాంకు ఊపిరిపోశారని అన్నారు. స్కీముల పేరుతో స్కాములకు పాల్పడి వందలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబు చట్టానికి అతీతుడు కాదని, అందుకే సీఐడీ అరెస్టుతో రిమాండ్‌కు వెళ్లాల్సిన దుస్థితి పట్టిందన్నారు. చంద్రబాబు అరెస్టుతో టీడీపీ నాయకులు లబ్ధిపొందాలని చూశారని టీడీపీ నాయకులు ఆడిన డ్రామాలకు రిమాండ్‌తో వారి ఆశలకు ఫుల్‌స్టాప్ పడిందని దుయ్యబట్టారు. తప్పుచేస్తే 75 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు పంపకూడదా అని ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతి కేసులో ఎవరి కుట్రలేదని చట్టం తనపని తాను చేసుకుపోతుందని అన్నారు. బాబు చేసిన మోసమే ఆయన్ని జైలుపాలు చేసిందన్నారు. ప్రస్తుతం బాబును చట్టం శిక్షించిందని, రానున్న ఎన్నికలలో ప్రజాకోర్టులో కూడా శిక్ష తప్పదని పేర్కొన్నారు.

డాక్టర్ శ్రీనివాసరెడ్డికి ఏఎన్‌యూ ప్రతిభా పురస్కారం



గుంటూరు మెడికల్: అత్యంత అరుదైన, క్లిష్టమైన సర్జరీలు, అవేక్ బ్రెయిన్ సర్జరీలు చేస్తూ బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు బ్రింద హాస్పిటల్‌కు చెందిన సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు. డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జన్‌గా పనిచేస్తూ తనకు వచ్చిన రెండు నెలల జీతాన్ని కోవిడ్ సమయంలో ప్రధాని మంత్రి సహాయనిధి, ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. అనేక మంది పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించి ప్రాణదాతగా నిలిచారు. బ్రెయిన్ సర్జరీల్లో అత్యంత ఆధునిక వైద్య పద్ధతిలో చేస్తూ రికార్డులు సృష్టించారు. అత్యంత అరుదైన బ్రెయిన్ ట్యూమర్లను సైతం గుర్తించి అరుదైన ఆపరేషన్లు చేస్తున్న వైద్యుడిగా రికార్డులకెక్కారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారాన్ని బ్రెయిన్ ట్యూమర్ రోగికి ల్యాప్‌ట్యాప్‌లో చూపిస్తూ మెలకువ ఉండగానే అరుదైన ఆపరేషన్ చేశారు. ఈ ప్రక్రియ గత నెలలో ఇంటర్‌నేషనల్ జర్నల్‌లో కూడా ప్రచురితమైంది. వైద్యుడిగా ఆయన సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారం అందజేయనుంది. పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలకుగాను గత నెల ఆగస్టు 15న బెస్ట్ డాక్టర్ అవార్డును జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఆగస్టు 21న కె.ఎల్. యూనివర్సిటీలో బ్రెయిన్ సర్జరీలపై చేస్తున్న పరిశోధనలకు గాను అత్యంత ప్రతిష్టాత్మకమైన డాక్టర్ సీవీ రామన్ అందుకున్నారు. తాజాగా యూనివర్సిటీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి బ్రింద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వసంత సాయికృష్ణప్రసాద్, సిద్ధార్థ, రేడియాలజిస్ట్ డాక్టర్ జమ్ముల అనిత, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

దళితులపై దాడుల్ని తిప్పికొట్టాలి



అనిల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: నేటికీ దళితులపై దాడులు తగ్గలేదని, దళిత రక్షణ చట్టాలు, ప్రత్యేక న్యాయస్థానాలు బాధితులకు న్యాయం చేయలేకపోతున్నాయని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ 32వ సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో దళిత పల్లెవీరులు రక్షణ దళాల్ని ఏర్పాటు చేసుకొని దాడుల్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 32 ఏళ్ల కిందట ఎనిమిది మందిని దారుణంగా చంపిన చుండూరు మారణకాండ కేసులో ఇప్పటికీ హంతకులకు శిక్ష పడకపోవడం, దళితుల ఉనికికే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు, చుండూరు దళిత పోరాట కమిటీ నాయకులు జాలాది మోజెస్, దేవరపల్లి వీరయ్య, చుక్క సుశీలరావు, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు బుస్సా రత్నప్రసాద్, కొసనం రాము, భూపతి సునీల్ కుమార్, పొందుగల ప్రకాష్, ఐలా మాణిక్యరావు, సాతులూరి రామాంజయనేయులు, మేళం భాగ్యరావు పాల్గొన్నారు.

వైద్యురాలిగా ప్రభావతి సేవలు ఆదర్శనీయం



డాక్టర్ ప్రభావతిని సత్కరిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్‌గా విశేష సేవలంచిన డాక్టర్ ప్రభావతిని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సత్కరించడం సంతోషదాయకంగా ఉందని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికే తలమానికంగా నిలిచి, ఎటువంటి క్లిష్టమైన జబ్బులనైనా ఇట్టే నయం చేస్తూ వైద్య వృత్తికే డాక్టర్ ప్రభావతి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరిటెండెంట్‌గా విరామం లేకుండా పని చేస్తూ, చిరునవ్వుతో రోగులకు ధైర్యాన్ని అందించి సేవలు అందించారని గుర్తు చేశారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ నగర ప్రజల సహాయ, సహకారాలతోనే జీజీహెచ్‌లో సేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ ప్రభావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిండు జీవితాలను బలి చేసుకోవద్దు

దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందని, చిన్న చిన్న సమస్యలకే బెంబేలెత్తి పోయి చేతులారా నిండు జీవితాన్ని నాశనం చేసుకునే స్థితి నుంచి బయట పడాలని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆత్మహత్య..మానసిక సమస్యే అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారే ఎక్కువని తెలిపారు క్షణికావేశంలో నిండు జీవితాల్ని బలి చేసుకుంటున్న వారి వల్ల కుటుంబ సభ్యులు కుదేలై పోతున్నారని చెప్పారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాల్ని వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం అభినందనీయం



బ్రాడీపేటలో విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆదివారం బ్రాడీపేటలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన 150 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దాతల సాయం అందిపుచ్చుకుని విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ గవర్నర్ వడ్లమాని రవి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మీపతి, కార్యదర్శి తాళ్లూరి ప్రకాష్, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, సంజీవరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో...

విద్యార్థులు దాతల సాయాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని రిటైర్డ్ ఎస్బీఐ ఛీఫ్ మేనేజర్ కోటేశ్వరరావు శాస్త్రి తెలియజేశారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏటీ అగ్రహారంలోని సంఘ కార్యాలయంలో బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు చదువులకు దూరం కాకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు లక్ష్మీకాంతరావు, సెక్రటరీ సత్యనారాయణ, ఆర్గనైజిగ్ సెక్రటరీ వెంకటరామయ్య, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



తెనాలిటౌన్: కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం ఏకాదశి పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆదివారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం పర్యవేక్షణలో సుమారు 100 మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు శ్రీరామ చక్రవర్తి పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పేదలకు అన్నదానం



నగరంపాలెం: స్వచ్ఛ హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జీజీహెచ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ తరఫున ప్రతి నెలలో రెండుసార్లు ఉచిత అన్నదానం చేస్తున్నట్లు చైర్మన్ జొన్నలగడ్డ రాజమోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుజాత, అఖిల్‌రాజ్, అభయ్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఆదివారం కళాలయ మెలోడీస్ వ్యవస్థాపకులు ఏ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ పాటల 21వ సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. అలనాటి పలు చిత్రాల్లోని మధుర గీతాల్ని గాయకులు పి. మొగిలి, ఈ. భారతీరెడ్డి, వి.ఎ స్.ఎస్. మల్లేశ్వరరావు, రత్నాజీ, ఎం. రమణి, పి. గాయత్రి ఆలపించారు. కీబోర్డ్ పై కె. రవి, తబలాపై ఎస్. వెంకట్, పాడ్స్‌పై ఎన్. సురేష్ వాయిద్య సహకారంతో కార్యక్రమం హుషారుగా సాగింది. అనంతరం కళాకారుల్ని సత్కరించారు.

చిట్యాల ఐలమ్మకు నివాళి



నెహ్రూనగర్: తెలంగాణ భూ పోరాటంలో కీలక భూమిక పోషించిన చిట్యాల ఐలమ్మ చిరస్మరణీయురాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఐలమ్మ వర్ధంతిని వర్ధంతిని పురస్కరించుకుని బాలాజీనగర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ పోరాటంతో పేద వర్గాలకు లక్షలాది ఎకరాలు భూమి పంచి పెట్టారని తెలిపారు. ఆమె పోరాటం స్ఫూర్తితో బహుజనులు ముందుకు నడవాలని చెప్పారు. ఐలమ్మ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తాటికొండ నరసింహారావు, మక్కెన రాజు, మురళీకృష్ణ, సాంబయ్య, బాజీ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులంతా ముందుండాలి



సభలో మాట్లాడుతున్న టంగుటూరి రామకృష్ణ

పాత గుంటూరు: ఆర్యవైశ్యులంతా సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పేదల్ని ఆదుకోవాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ సూచించారు. అరండల్‌పేటలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సభకు రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉంటూ సమస్యల్ని పరిష్కరించుకోవాలని తెలిపారు. మహాసభ అధ్యక్షుడు గోపవరపు శివ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ప్రపంచ ఆర్య వైశ్య మహాసభలో సభ్యులుగా చేరాలని కోరారు. సభ్యుల సంక్షేమం కోసం మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సదరన్ హోటల్స్ ఎండీ ఆలపాటి కృష్ణమోహన్, అండ దివ్య, జూలకంటి శ్రీనివాసరావు, గ్రంధి ధనలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల 'స్వచ్ఛత' లఘుచిత్రం



క్లాప్ కొడుతున్న ఉమామహేశ్వర్

తెనాలి: స్వచ్ఛతా పక్వాడ్‌లో భాగంగా స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం 'స్వచ్ఛత' పేరుతో లఘుచిత్రం తీశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ నఫీసా అనే విద్యార్థినిపై క్లాప్ కొట్టారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ దర్శకత్వం వహించారు. స్వచ్ఛతను పాటించినప్పుడే మనిషికి ఆయుష్షు, ఆరోగ్యం రెండూ ఉంటాయని నఫీసా చెప్పగా, విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేసిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. పెద్దల అడుగుజాడల్లో నడవాలనీ, ఆరుబయట మలవిసర్జన చేయరాదనీ, నీటిని పొదుపుగా వాడాలనీ, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలనీ, గాలిని, భూమిని, నింగిని పరిశుభ్రంగా ఉంచుకోవాలనే సందేశంతో ఈ లఘుచిత్రాన్ని తీస్తున్నామని వెంకట్ తెలియజేశారు.

గంగానమ్మతల్లి ఆలయంలో కొలుపులు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

తెనాలిటౌన్: పట్టణ మారీసుపేటలోని ఆర్.ఆర్.నగర్‌లో రెండో లైనులో ఉన్న గంగానమ్మ తల్లి ఆలయంలో ఆదివారం కొలుపులు నిర్వహించారు. శ్రావణ మాసం నాలుగో ఆదివారం రోజు ప్రతి ఏడాది కొలుపులు జరుపుతున్నామని పూజారి దేశబోయిన శివయ్య తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి ఆచారం ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు చేశారు. వివిధ వేషధారణలతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రభ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో శివయ్య పూజారి, మైలా హరికృష్ణ, కుమార్, మంగమూరి హైమారావు, ఆనంద కిషోర్, శంకర్, కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.